క్లుప్తంగా

నేడు, రేపు విద్యుత్‌కు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో బుధ, గురువారాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కలిగే అంతరాయంతో కోర్లమ్మ పేట, సాంబశివరావు పేట, రామచంద్రరావు పేట, దేవీచౌక్, తుమ్మలావ ప్రాంతాల్లో ప్రభావం ఉంటుందన్నారు.
- బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ వెంకటేశ్వర నగర్ ఏరియా, డాక్టర్ గోలి రామారావు వీధి, వాకర్స్ పార్క్ రోడ్డు, సత్యవతి హోటల్ రోడ్డు, మహాలక్ష్మి టెంపుల్ స్ట్రీట్స్, వాకర్స్ రోడ్, సుక్షేత్ర అపార్ట్‌మెంట్స్ ఏరియా, విద్యుత్ కాలనీలో సరఫరా ఉండదు.
- గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కొంతమూరులోని కల్యాణ్ నగర్, ఆదర్శ్ నగర్, జంగాల కాలనీ, శేషాద్రి లే అవుట్, క్వారీ ఏరియా, కంటిపూడి లేఅవుట్‌కు విద్యుత్ ఆగిపోతుంది.

కడియం: మండల పరిధిలోని పలు గ్రామాలకు గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.శామ్యూల్ తెలిపారు. ఆర్‌డీఎస్ పనుల్లో భాగంగా వేమగిరి సబ్‌స్టేషన్ నుంచి వచ్చే జేగురుపాడు ఫీడర్‌కు, జేగురుపాడు సబ్‌స్టేషన్ (పాముల మెట్ట నుంచి వచ్చే) జేహెచ్‌సీ ఫీడర్‌కు సరఫరా నిలిపివేస్తారన్నారు. దీని కారణంగా జేగురుపాడు, చైతన్యనగర్ ఇండస్ట్రీయల్ ఏరియా ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

నీట్ ఫస్ట్ ర్యాంకర్‌కు అభినందన



నీట్ ర్యాంకర్ కార్తిక్ రామ్‌కిరీటిని అభినందిస్తున్న చంద్రబాబు, చిత్రంలో నున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: నీట్ 2025 ఫలితాలలో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 19వ ర్యాంకు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన తిరుమల విద్యాసంస్థల విద్యార్థి డి.కార్తిక్ రామ్‌కిరీటిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. అలాగే జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025లో ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో ఆలిండియా 8వ ర్యాంకు సాధించిన కె.యశ్వంత్ సాత్విక్, ఎస్సీ కేటగిరీలో ఆలిండియా 2వర్యాంకు సాధించిన కె.ప్రణీత్‌లను పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు పాల్గొన్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు



ముగ్గళ్లలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

సీతానగరం: మండలంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు మంగళవారం భక్తులతో కిటకిటలాడాయి. ముగ్గళ్లలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి ఉదయం 4 గంటల నుంచి భక్తుల రాక మొదలైంది. ఆషాఢమాసంలోని మంగళవారం షష్టి తిథి కారణంగా భక్తులు పలు రకాల ద్రవ్యాలతో స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేయించారు. అర్చకులు కొడమంచిలి వినేష్, విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. సీతానగరం, రఘుదేవపురం, మునికూడలి తదితర గ్రామాల్లో ఆలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

లంక భూములను పేదలకు పంపిణీ చేయాలి



చీపురుపల్లిలో పర్యటిస్తున్న సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి వీరబాబు

సీతానగరం: ప్రభుత్వానికి చెందిన పోడు, సీలింగ్, లంక భూములను నియోజకవర్గంలోని పేదలకు సాగు చేసుకోవడానికి పంపిణీ చేయాలని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం చీపురుపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాగంపల్లి, చీపురుపల్లి, పెదకొండేపూడి, సీతానగరంలోని లంకభూములను నిరుపేదలకు అందజేయాలన్నారు. ఈనెల 4న అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని సీతానగరంలోని పార్టీ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహిస్తామన్నారు. పోడు భూములను భూస్వాములు ఆక్రమించుకుంటున్నారని ధ్వజమెత్తారు. గిరిజన, పేద రైతుల వ్యక్తిగత దరఖాస్తులను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. త్వరలో భూమి లేని రైతులతో చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

సాగు పనులు చకచకా..

- ఊపందుకున్న ఖరీఫ్ పనులు
- కొనసాగుతున్న వరి నాట్లు
- బెంగాల్, గుంటూరు కూలీల హవా
- కాంట్రాక్టు విధానంలో నిర్వహణ
- ఆసక్తి చూపుతున్న రైతులు



పొలంలో వరినాట్లు వేస్తున్న బెంగాల్ కూలీలు

కడియం: నియోజకవర్గంలోని రూరల్, కడియం మండలాల్లో తొలకరి వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ముందుగానే వర్షాలు రావడం, వాతావరణం అనుకూలించడంతో దమ్ములు, నాట్లు వేయడంలో రైతులు నిమగ్నమయ్యారు. గత వారం రోజులుగా నాట్లు ప్రారంభయ్యాయి. రూరల్ నియోజకవర్గంలో సుమారు 5 వేల హెక్టార్లలో వరి సాగవుతోంది. ప్రస్తుతం ఇందులో 10 శాతం వరకు నాట్లు పూర్తయినట్లు వ్యవసాయ శాఖ సిబ్బంది చెబుతున్నారు. రానున్న వారం, పది రోజుల్లో యాభై శాతానికి పైగా వరి నాట్లు పూర్తవుతాయని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు, అధికారులు పలు వ్యవసాయ క్షేత్రాల్లో పర్యటించి, రైతులకు సూచనలు అందజేశారు. దమ్ము, ఆకుమడుల యాజమాన్యం, నాట్లు వేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

కాంటాక్టు విధానంలో పనులు

గత నాలుగు, ఐదేళ్లుగా నాట్లు వేయడంలో బెంగాల్, గుంటూరు ప్రాంతానికి చెందిన కూలీలదే పైచేయిగా ఉంటోంది. ఈ యేడాది సైతం దాదాపు 10 వరకు బృందాలు ఆయా ప్రాంతాల నుంచి రూరల్ నియోజకవర్గంలోని రూరల్, కడియం మండలాలకు చేరుకుని వరి నాట్లు వేస్తున్నాయి. ఆకు తీసి, నాట్లు వేయడం, లైన్లు వేయడం వరకు వారే పూర్తి చేస్తుండడంతో రైతులకు కొంత మేరకు శ్రమ తగ్గుతోంది. సాధారణంగా ఆకు తీసి, చేలోకి చేరిస్తే మహిళా కూలీలు నాట్లు వేయడం జరిగేది. అయితే ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న కూలీలు ఆకు తీత, నాట్లు వేయడం కూడా కాంట్రాక్టుకు మాట్లాడుకునే పనులు చేసేస్తున్నారు. దీంతో స్థానిక రైతులు వీరి వైపే మొగ్గు చూస్తున్నారు.

వారి వైపే మొగ్గు

ఎకరా పొలంలో నాట్లు వేయడానికి బెంగాల్ కూలీలు రూ.4,200 నుంచి 4,500 వరకూ తీసుకుంటున్నారు. గుంటూరు ప్రాంతానికి చెందిన కూలీలు కూడా రూ.4,500 నుంచి రూ.5 వేల వరకూ వసూలు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల కూలీలు అనుసరిస్తున్న కాంట్రాక్టు విధానం అనువుగా ఉండడం, రైతులందరూ వారి వేపే మొగ్గు చూపుతుండడంతో స్థానికంగా నాట్లు వేసే కూలీలు సైతం వారి మార్గాన్నే అనురిస్తున్నారు. ఆకుతీత, నాట్లు వేయడం గుత్తుకు మాట్లాడుకుని నాట్లు వేస్తున్నారు. అయితే ఇతర ప్రాంతాల కూలీలు నాట్లు వేస్తే ఎకరాకు అదనంగా ఒకటి రెండు బస్తాల ఎరువులు అవసరం అవుతుందని కొందరు రైతులు చెబుతున్నారు. నాట్లు దూరంగా వేయడంతో అదనంగా ఫెర్టిలైజర్ అందించాల్సి ఉంటుందన్నారు. స్థానిక కూలీలు వేసే నాట్లు దగ్గరగా ఉంటాయని, తొందరగా చేనంతా దుమ్ములు కమ్మేస్తాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. రైతుల సౌలభ్యాన్ని బట్టి కూలీలను ఎంపిక చేసుకుని నాట్లు వేస్తున్నారు.

తక్కువ ఖర్చు

నాలుగున్నర ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాను. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కూలీలతో నాట్లు వేయించాను. వేగంగా పని పూర్తికావడంతో పాటు, కూలీలకు ఆకు అందించాలన్న శ్రమ తగ్గింది. కూలీ ఖర్చు కూడా తగ్గుతుండడంతో వారి వైపే రైతులందరూ మొగ్గుచూపుతున్నారు.

– మాణిక్యం, రైతు

దమ్ము చేసి అప్పగిస్తే చాలు

చేలో దమ్ములు పూర్తి చేసి, బల్ల తోలించేసి తగినంత నీటిని ఉంచి కూలీలను పిలిస్తే వారే ఆకు తీసి, నాట్లు వేసేస్తున్నారు. ఈ పని మొత్తానికి అయ్యే ఖర్చు కూడా ఇతర ప్రాంతాల కూలీల కారణంగా రూ.2 వేల నుంచి రూ. 3 వేల వరకు తగ్గుతోంది. దీంతో వారితోనే నాట్లు వేయిస్తున్నాం.

– నాగేశ్వరరావు, రైతు.

మర్యాదపూర్వకంగా..



మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న నాగేశ్వర్, పర్వతవర్ధిని దంపతులు

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మంగళవారం తాడేపల్లిలో ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్, డాక్టర్ పర్వతవర్ధిని దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు జ్ఞాపిక అందజేసి శాలువాతో సత్కరించారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మాధవ్ ఎన్నికపై హర్షం

సీటీఆర్ఐ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా సీనియర్ నేత, బీసీ నాయకుడు పీవీఎన్ మాధవ్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దున్న సుమన్ బాబు అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ నిజాయితీతో కూడిన రాజకీయం చేస్తూ, సమర్థవంతమైన నాయకుడిగా మాధవ్ పేరు తెచ్చుకున్నారన్నారు. 2024 ఎన్నికలలో కూటమి అభ్యర్థుల విజయానికి కష్టపడి పనిచేశారన్నారు.

ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో విద్యార్థుల ప్రతిభ



వార్షిక శిబిరంలో ప్రతిభ చూపిన ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు

కంబాలచెరువు: ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరంలో ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబర్చారని ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే అన్నారు. ఈ మేరకు మంగళవారం కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్‌సీసీ అధికారి, లెఫ్టినెంట్ డాక్టర్ షేక్ ఈసుబ్ బాషా మాట్లాడుతూ సూరంపాలెంలోని ఆదిత్య గ్లోబల్ యూనివర్సిటీలో జూన్ 22 నుంచి జూలై ఒకటో తేదీ వరకూ 18వ ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో మేజర్ మహమ్మద్ కె.ఆసిఫ్ సారథ్యంలో ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం జరిగిందన్నారు. దీనికి జిల్లాలోని వివిధ కళాశాలలు, స్కూళ్లకు చెందిన 550 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరయ్యారన్నారు. వారిలో ఆర్ట్స్ కళాశాలకు చెందిన 42 మంది ఉన్నారన్నారు. ఆ శిబిరంలో డ్రిల్, మ్యాప్ రీడింగ్, ఫైరింగ్, యోగా, వ్యాయామం, పరిసరాల పరిశుభ్రత, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం, ఆర్మీ చరిత్ర వంటి అనేక అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడేట్లు డ్రిల్, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, సోలో సింగింగ్ వంటి అంశాలలో ప్రథమ, కోకోలో ద్వితీయ స్థానాల్లో నిలిచి, ఫైరింగ్‌లో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించారన్నారు. కళాశాలకు చెందిన మిద్ది ప్రవీణ్ కుమార్ దొర క్యాంప్ సీనియర్ కేడెట్‌గా, లెఫ్టినెంట్ బాషా క్యాంప్ అడ్జురెంట్‌గా సమర్థంగా విధులు నిర్వహించి క్యాంప్ కమాండెంట్ మేజర్ ఆసిఫ్ నుంచి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు పొందారన్నారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే, డాక్టర్ శ్రీరామ్‌మూర్తి, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ జి.చంద్రశేఖర్ అభినందించారు.

ఎల్ఐసీ జాతీయాకరణలో ఏఐఐఈఏ పాత్ర కీలకం

- అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోదండరామ్
- ఘనంగా సంఘ ఆవిర్భావ దినోత్సవం



ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయంలో జరిగిన నిరసనలో మాట్లాడుతున్న కోదండరామ్

రాజమహేంద్రవరం రూరల్: ఎల్ఐసీ జాతీయాకరణలో ఆల్ ఇండియా ఇన్స్యూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) ప్రముఖ పాత్ర పోషించిందని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ అన్నారు. ఆ యూనియన్ ఏర్పడి 75వ సంవత్సరంలోకి ప్రవేశించిన సందర్భంగా మోరంపూడిలోని ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయంలో మంగళవారం యూనియన్ ఆవిష్కరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు మాథ్యూస్ యూనియన్ పతాక ఆవిష్కరణ చేసి, సంఘ ఆవశ్యకతను తెలిపారు. కోదండ రామ్ మాట్లాడుతూ ఎల్ఐసీ ప్రభుత్వ రంగంలో ఉండటం వల్ల ప్రజల సొమ్ముకు భద్రత కల్పించడంతో పాటు, కోట్లాది పాలసీ దారులు పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేస్తూ సేవలు అందిస్తోందన్నారు. అనంతరం సభ్యులందరికీ చేత సంఘం ఐక్యత కాపాడతామని, యూనియన్ అభివృద్ధికి పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. ఏఐఐఈఏ ప్లాటినమ్ జూబ్లీ లోగో ఆవిష్కరణ కార్యక్రమం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, మహిళా కన్వీనర్ చేతుల మీదుగా నిర్వహించారు.

భోజన విరామంలో నిరసన

ఈ నెల 9వ తేదీన జరగబోయే సార్వత్రిక సమ్మెలో భాగంగా ఎల్ఐసీ ఉద్యోగులు మంగళవారం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ప్రధాన కార్యదర్శి కోదండరామ్ మాట్లాడుతూ జీవిత బీమా, ఆరోగ్య బీమాపై ప్రజలకు భారంగా మారిన జీఎస్‌టీని పూర్తిగా రద్దు చేయాలని, కార్మికుల హక్కులను హరించే కొత్త లేబర్ కోడ్‌లను తొలగించాలని, ఎల్ఐసీలో ఖాళీగా ఉన్న క్లాస్ 3, 4 ఉద్యోగుల నియామకాలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. నిరసనలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి గన్నెయ్య, ఓబీసీ ఉద్యోగుల సంఘం సంయుక్త కార్యదర్శి రమేష్ బాబు, డివిజనల్ ఆఫీసు యూనిట్ కార్యదర్శి విశ్వనాథ్, రూరల్ బ్రాంచ్ తరఫున జి.శ్రీనివాస్, విశ్రాంత ఉద్యోగుల నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సీతానగరం: మండలంలోని వంగలపూడికి చెందిన టి.వెంకట శ్రీనివాసరావు (38) రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ వాసంశెట్టి శ్రీను తెలిపారు. వివరాల్లోకి వెళితే.. శ్రీనివాసరావుకు ఏడేళ్ల క్రితం వివాహమైంది. అయితే భార్య పుట్టింటిలో ఉండడంతో మనస్తాపానికి గురై గత నెల 22న పురుగు మందు తాగేశాడు. దీంతో అతడిని చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య సేవలు పొందుతూ తెల్లవారుజాము 3.30 గంటలకు మృతి చెందాడు. శ్రీనివాసరావుకు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు భద్రం మృతి



కోరుకొండ: మండలంలోని శ్రీరంగపట్నం గ్రామానికి వైఎస్సార్ సీపీ నాయకుడు సూరిశెట్టి భద్రం (60) మంగళవారం మృతి చెందారు. స్వగ్రామంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన భౌతిక కాయానికి వైఎస్సార్ సీపీ కేంద్ర కమిటీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, పార్టీ యువజన విభాగం ఉభయ గోదావరి జిల్లాల కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ తదితరులు నివాళులర్పించారు. గణేష్ మాట్లాడుతూ భద్రం శ్రీరంగపట్నంలో ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారన్నారు. ఫొటోగ్రాఫర్‌గా కార్మికులు, రైతుల కష్టాలను ప్రజలకు చూపించారన్నారు.

డైట్ అధ్యాపకులు, సిబ్బందికి సత్కారం



అధ్యాపకురాలిని సత్కరిస్తున్న డైట్ ప్రిన్సిపాల్ జయశ్రీ

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ప్రభుత్వ విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో పనిచేసి, ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన అధ్యాపకులు, ఇతర సిబ్బంది అందించిన సేవలు అభినందనీయమని డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీ అన్నారు. ఈ మేరకు మంగళవారం బొమ్మూరు డైట్ కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. బదిలీ అయిన అధ్యాపకులు, ఇతర సిబ్బందిని శాలువాలతో సన్మానించి, మెమెంటోలు అందజేశారు. డైట్ అధ్యాపకులు సుజాతా రత్నం, జానకీ దేవి, గంగాధర్, ఎస్తర్, కళావతి సత్యనారాయణతో పాటు అధ్యాపకేతర సిబ్బంది ప్రసాద్, చాందినీ, తేజ ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. దీంతో వీరందరినీ సన్మానించారు. అలాగే వివిధ పాఠశాలల నుంచి డిప్యూటీషన్‌పై డైట్‌కు అధ్యాపకులు, సిబ్బందికి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజు, సూర్యనారాయణ, రఘుబాబు, రామకృష్ణ, రమేష్ బాబు, సీనియర్ అసిస్టెంట్ సల్మా, కిరణ్మయి, ఛాత్రోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు సత్కారం



గుమ్ములూరు హైస్కూల్లో హిందీ ఉపాధ్యాయుడు, పీడీలను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కోరుకొండ: విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు ఉపాధ్యాయులు చేసే కృషి అభినందనీయమని గుమ్ములూరు హైస్కూల్ హెచ్‌ఎం గంగాభవాని అన్నారు. ఆ పాఠశాలలో పనిచేస్తున్న హిందీ ఉపాధ్యాయుడు హేమంత్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) నూకరాజులు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పీడీ టీనూకరాజు ఎందరో విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దారన్నారు. హేమంత్ కుమార్ హిందీ బోధన ద్వారా విద్యార్థులను ప్రయోజకులను చేశారన్నారు. అనంతరం వారిద్దరినీ శాలువా, పూలమాలలతో సత్కరించారు. అలాగే బూరుగుపూడి హైస్కూల్‌లో హెచ్‌ఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్న వీవీఎస్ఎస్ఎస్ ప్రసాద్ ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను విద్యార్థులు సత్కరించారు.

సువర్ణ వర్తకుల సంక్షేమానికి కృషి



సమావేశానికి హాజరైన ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: సువర్ణ వర్తకుల సంక్షేమం, భద్రతకు సువర్ణ వర్తక సంఘం నిరంతరం పనిచేస్తుందని ఆ సంఘం అధ్యక్షుడు అడపా శ్రీహరి అన్నారు. గుండువారి వీధిలోని సువర్ణ వర్తక సంఘం కల్యాణ మండపంలో మంగళవారం నగరంలోని సువర్ణ వర్తకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గన్నెబో కంపెనీ రీజినల్ మేనేజర్ దుప్పాల సుధీర్ మాట్లాడుతూ బంగారం, వజ్ర ఆభరణాలు వంటి విలువైన వస్తువులే కాకుండా విలువైన డాక్యుమెంట్లను భద్రపరిచేందుకు గన్నెబో స్టేలేజ్ లాకర్లు నమ్మకమైనవన్నారు. జ్యూయలరీ సంస్థలు తమ ఉత్పత్తులను సురక్షితంగా ఉంచుకోవడానికి బీఐఎస్ సర్టిఫికేషన్ కలిగిన సేఫ్టీ లాకర్లను మాత్రమే వినియోగించుకోవాలన్నారు. ఏదైనా చోరీ, అగ్ని ప్రమాదం సంభవించినా బీమా పరిష్కారం కావాలంటే టార్చ్ అండ్ టూలా (టీఆర్‌టీఎల్) రెసిస్టెన్స్ గల సేఫ్టీ లాకర్లను మాత్రమే వినియోగించాలన్నారు. సమావేశంలో చాంబర్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు, కార్యదర్శి గంటా ప్రకాష్, గౌరవ అధ్యక్షుడు కూర్మదాసు ప్రభాకర్, రాష్ట్ర సువర్ణ వర్తక సంఘం కార్యదర్శి దొండపాటి జయసింహ, సువర్ణ వర్తక సంఘం కల్యాణ మండపం అధ్యక్షుడు బొడ్డు రామారావు, వెత్సా బాబ్జీ, సప్పా వెంకటరమణ, లక్కోజి వీరభద్రరావు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడం దైవ కార్యం



చిన్న వెంకన్నబాబును సత్కరిస్తున్న పట్టాభి శాస్త్రి

సీటీఆర్ఐ: ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం దైవ కార్యంతో సమానమని మహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వరస్వామి పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు అన్నారు. ఆయన జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మన గుడి, మన సేవ ఉభయ రాష్ట్రాల ఆధ్యాత్మిక సేవా పురస్కారం, రాజహంస పురస్కార గ్రహీత జి.సుబ్రహ్మణ్య పట్టాభి శాస్త్రి శాలువతో చిన్న వెంకన్నబాబును సత్కరించారు. నగరంలోని సుమారు వెయ్యి మంది అనాథలు, యాచకులు, వృద్ధులకు అన్న వితరణ చేశారు. గాడాల గ్రామంలోని పీఠంలో భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా చిన్న వెంకన్నబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరోపకారం చేయాలనే సంకల్పంతో ముందుకు సాగాలన్నారు. ఆధ్యాత్మిక చింతనతో మాత్రమే అది సాధ్యమన్నారు. ఆషాఢ మాసంలో వారాహి అమ్మవారిని దర్శించుకోవడం వల్ల విశేష పూజాఫలం దక్కుతుందన్నారు.

సినిమాలు



శ్యామల	: మార్గన్
సూర్యమినీ	: ఎఫ్–1 దిమూవీ
సూర్యప్యాలెస్	: కన్నప్ప
స్వామి	: కుబేర
అనుశ్రీ	: కన్నప్ప
రాజా	: కన్నప్ప
శివజ్యోతి	: కుబేర
ఊర్వశి	: 8 వసంతాలు
మేనక	: చంద్రేశ్వర, హనుమాన్ జంక్షన్
రంభ	: మా
అప్సర	: కన్నప్ప
అశోక నామవరం	: కన్నప్ప
వీఎస్ మహల్ ధవళేశ్వరం	: కన్నప్ప
మురళీకృష్ణ కడియం	: కన్నప్ప
వెంకటసూర్య	: కన్నప్ప

డాక్టర్ బీసీ రాయ్ సేవలు స్ఫూర్తిదాయకం



వైద్యుల దినోత్సవంలో మాట్లాడుతున్న పీఎంపీ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు



భాస్కరరామ్‌ను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: డాక్టర్ బీసీ రాయ్ పేదలకు అందించిన సేవలే నేటి వైద్యులకు స్ఫూర్తిదాయకమని కమ్యూనిటీ పారా మెడిక్స్–ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు అన్నారు. ఆ అసోసియేషన్ రాజమహేంద్రవరం శాఖ ఆధ్వర్యంలో హుకుంపేటలోని గోదావరి రుచులు కాన్ఫరెన్స్ హాల్లో రాజమండ్రి శాఖ అధ్యక్షుడు రహమాన్ ఖాన్ అధ్యక్షతన మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు మాట్లాడుతూ డాక్టర్ బీసీ రాయ్ 1882 జూలై 1న జన్మించారని, వైద్యుడిగా కలకత్తాలో ఎందరో పేదలకు వైద్య సేవలందించారన్నారు. అనంతరం కలకత్తా మేయర్‌గా, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా కూడా పనిచేశారన్నారు. ఆయన 1962 జూలై 1న కన్నుమూశారని తెలిపారు. డాక్టర్ బీసీ రాయ్ జయంతి, వర్ధంతి ఒకే రోజు కావడం విశేషమని, ఆ రోజునే జాతీయ వైద్యుల దినోత్సవం జరుపుకొంటున్నామన్నారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు, రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు, జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, జిల్లా కోశాధికారి పి.చిన్ని, మండల కార్యదర్శి మట్టా రమేష్, కోశాధికారి యు.ప్రసాద్ బాబు, కేఎస్ఎస్ఎన్ రెడ్డి, ఏ.సురేష్ బాబు, కె.లక్ష్మీనారాయణ, ఎం.బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్లు, ఆడిటర్లు సమాజ సేవకులు

రాజమహేంద్రవరం సిటీ: సమాజానికి ఆడిటర్లు, డాక్టర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ చార్టర్ ప్రెసిడెంట్ తీగెల రాజా కొనియాడారు. డాక్టర్స్ డే, ఆడిటర్స్ డేలను పురస్కరించుకుని మంగళవారం ఆడిటర్లు విశ్వనాథం భాస్కరరామ్, వెంకటేశ్వర్లు, లక్ష్మీనరసింహారావు, బోడా చిన్న సూర్యనారాయణ, న్యూరో సర్జన్ డాక్టర్ సాంబశివరావురెడ్డిలను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ ఇన్ కమింగ్ ప్రెసిడెంట్ మండవల్లి వెంకన్నబాబు, ఇన్ కమింగ్ సెక్రెటరీ పి.రఘునాథరాజు, ట్రెజరర్ షేక్ దావత్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.